# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 21 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణ స్వీకారం

**హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

బీహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం పదోసారి ప్రమాణం చేశారు. పాట్నాలోని గాంధీ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ , కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, ఏపీ సీఎం చంద్రబాబు, ఎన్డీఏ పాలిత నితీశ్‌కుమార్ అను నేను..రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌తో పాటు 19 మంది మంత్రులు ప్రమాణం చేశారు. బీజేపీ నుంచి సీనియర్ నాయకుడు సామ్రాట్ చౌదరి, దిలీప్ జైశ్వాల్, మంగల్ పాండే, రామ్‌కపాల్ యాదవ్, సంతోష్ సుమన్ తదితరులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జేడీయూ నుంచి విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, శ్రవన్ కుమార్, లేసి సింగ్, సునీల్ కుమర్ల చేత గవర్నర్ అమాత్యులుగా ప్రమాణం చేయించారు. ఎల్జేపీ- రామ్‌విలాస్ పాసవాన్, రాష్ట్రీయ లోక్ మోర్చా, హిందూస్తాన్ అవామ్ మోర్చా నుంచి ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. జనవరిలో క్యాబినెట్ విస్తరణ

మిగితా 2వ పేజీలో

### తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల

# అనుబంధానికి కొత్త అధ్యాయం

- భారత్ ఫ్యూచర్ సిటీలో 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రానికి' ఉచిత స్థలం కేటాయింపు
- సంస్కృతుల సంగమం-సమృద్ధికి సోపానం ఉత్సవాల ఘన ప్రారంభం
- దేశంలోనే మొదటి నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రం తెలంగాణలోనే
- సీఎం రేవంత్ రెడ్డి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ – ఈశాన్య రాష్ట్రాల మధ్య సంబంధాలను మరింత పటిష్టపరుచుకోవడానికి భారత్ ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అనుబంధ కేంద్రంలో ప్రతి ఈశాన్య రాష్ట్రం తన సొంత భవనాన్ని నిర్మించుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. తెలంగాణ – ఈశాన్య రాష్ట్రాల మధ్య కళలు, సంస్కృతి, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఆవిష్కరణల వంటి అంశాల్లో నిరంతర సహకారం, పరస్పర అవగాహన కోసం తెలంగాణ – నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్: 'సంస్కృతుల సంగమం – సమృద్ధికి సోపానం' పేరుతో ఉత్సవాలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి.

తెలంగాణ – నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్ వేడుక ప్రారంభోత్సవంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారు, గవర్నర్ సతీమణి శ్రీమతి సుధా దేవ్ వర్మ గారు, త్రిపుర గవర్నర్ శ్రీ నల్లు ఇంద్రసేనా రెడ్డి గారితో కలిసి ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో మొట్టమొదటి "నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని" తెలంగాణ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే ప్రణాళికలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి గౌరవ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారు నాయకత్వం వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖతో పాటు 8 రాష్ట్రాలతో కలిసి సమిష్టిగా పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలు కూడా అన్ని రంగాలలో దేశానికి మరింతగా తోడ్పాటు అందిస్తున్నాయని అన్నారు.

"అస్సాం, అరుణాచల్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు అనుసంధాన కేంద్రంలో అవసరమైన హాస్టల్ సౌకర్యం, ఆహారం, కళలు, చేతి వృత్తులు, సంస్కృతులు, కళల ప్రదర్శనకు వేదికలుగా ఈ భవనాలు పని చేస్తాయి. త్రిపురకు చెందిన జిష్ణుదేవ్ వర్మ తెలంగాణ గవర్నర్‌గా, తెలంగాణకు చెందిన ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా పనిచేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే బలమైన సంబంధాలను కలిగి ఉన్నాం.

తెలంగాణ – ఈశాన్య రాష్ట్రాల మధ్య మరింత సహకారానికి, ప్రజల మధ్య సంస్కృతుల పరస్పర మార్పిడికి ఈ ఉత్సవాలు నాంది మాత్రమే. "తెలంగాణ–నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్" టెక్నో – కల్చరల్ ఫెస్టివల్ విజయవంతం కావడానికి కృషి చేసిన అందరికీ అభినందనలు. ఈ ఉత్సవాలు ఈశాన్య రాష్ట్రాలకు తెలంగాణకు మధ్యన ఉన్న ఏకత్వ స్ఫూర్తిని చాటుతోంది.

ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు తెలంగాణ రెండో ఇల్లు లాంటిది. హైదరాబాద్‌కు ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఐటీ, ఫార్మా, హెల్త్ కేర్, టూరిజం, హాస్పిటా టీ, స్టార్టప్, క్రీడల వంటి అన్ని రంగాల్లో విజయవంతంగా రాణిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తెలంగాణ సమాజంతో కలిసిపోయి, ఇక్కడ అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు వారికి ధన్యవాదాలు. హైదరాబాద్, తెలంగాణ ఇప్పటికే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది. ప్రపంచ దేశాలు పెట్టుబడుల కోసం చైనాకు ప్రత్యామ్నాయంగా చైనా ప్లస్ 1 దేశాల కోసం అన్వేషణలో ఉన్నాయి. తెలంగాణ ఇప్పటికే ఐటీ, ఫార్మా, జీసీసీ, డేటా సెంటర్స్, హెల్త్‌కేర్ అగ్రస్థానంలో ఉన్న తెలంగాణను మరింత ఉన్నత దశకు తీసుకెళ్లాలని భావిస్తున్నాం. ఈ ప్రణాళికల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళికలతో డిసెంబర్ 8, 9 వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ – 2047 గ్లోబల్ సమ్మిట్‌కు గవర్నర్ గారి నుంచి సంపూర్ణ సహకారం, మద్దతును కోరుతున్నాం.

తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ఉద్దేశాలను దేశంలోని ప్రతి ప్రాంతానికి, ప్రపంచం నలుమూలలకు తీసుకువెళ్లడానికి తెలంగాణ %-% నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్ ప్రతినిధుల సహాయం కావాలి.." అని ముఖ్యమంత్రి గారు కోరారు. ఈ ఉత్సవాల్లో మంత్రులు జూపల్లి కృష్ణా రావు గారు, పొన్నం ప్రభాకర్ గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు, డీజీపీ శివధర్ రెడ్డి గారితో పాటు ఈశాన్య రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఉత్సవంలో ఈశాన్య రాష్ట్రాల కళాకారులను సత్కరించారు.

# రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సరికాదు

- బిల్లులపై నిర్ణయం ఆలస్యం అనవసరం
- కారణం పేర్కొనకుండా నిలిపివేత రాజ్యాంగ విరుద్ధం
- నిరవధిక జాప్యం కుదరదు
- కారణం చూపకుండా బిల్లును తిరస్కరించొద్దు
- రాష్ట్రపతి ప్రశ్నలకు సమాధానమిచ్చిన సుప్రీంకోర్టు



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులు నెలల తరబడి గవర్నర్లు, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటం దేశవ్యాప్తంగా పెద్ద చర్చగా మారిన నేపథ్యంలో, సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పును వెలువరించింది. ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపించిన ప్రశ్నలకు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సమాధానమిచ్చింది.

**గవర్నర్‌కు మూడు ఎంపికలు**

కోర్టు తెలిపిన ప్రకారం, బిల్లు గవర్నర్ ఎదుటకు వచ్చిన తర్వాత వారికి మూడు అవకాశాలు ఉంటాయి: సమ్మతి తెలపడం, కారణంతో రాష్ట్రపతికి పంపడం, అసెంబ్లీకి తిరిగి పంపడం... ఈ మూడు ఎంపికల్లో ఏదిని ఎంచుకోవాలో నిర్ణయించడం గవర్నర్ విచక్షణాధికారం. కానీ ఆ విచక్షణాన్ని అపరిమితంగా ఉపయోగించడం సరికాదని కోర్టు హెచ్చరించింది.

రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గడువు విధించడం రాజ్యాంగ విరుద్ధం అని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే కారణం లేకుండా బిల్లులను అనంతకాలం పెండింగ్‌లో ఉంచడం కూడా న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని కోర్టు గుర్తించింది. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లును తిరిగి పంపినా, రాష్ట్రపతికి రిజర్వ్ చేసినా తగిన కారణాలతో, రాతపూర్వకంగా తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. లేదంటే భవిష్యత్తులో రాజ్యాంగపరమైన వివాదాలకు దారితీయవచ్చని హెచ్చరించింది.

ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ఎప్పుడైతే అవసరం అనుకుంటారో అప్పుడే సుప్రీంకోర్టును సంప్రదించవచ్చని కోర్టు తెలిపింది. ప్రతి రిజర్వ్ బిల్లు పైగా అభిప్రాయం కోరాల్సిన అవసరముండదని స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా పలు రాష్ట్రాలు ఆమోదించిన బిల్లులు గవర్నర్ల వద్ద నెలల తరబడి నిలిచిపోవడం, రాష్ట్రపతికి పంపిన వాటికి కూడా సంవత్సరకాలం దాటినా నిర్ణయం రాకపోవడం వల్ల వివాదం చెలరేగింది.

దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ద్విసభ్య ధర్మాసనం మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని చరిత్రాత్మక ఆదేశం ఇచ్చింది. అదే తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరిగి సుప్రీంకోర్టు అభిప్రాయం కోరడంతో తాజాగా రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. గవర్నర్లు, రాష్ట్రపతుల విచక్షణాధికారం ఉన్నప్పటికీ అది అవసరమైన పరిమితుల్లోనే ఉండాలని, బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో అనవసర ఆలస్యం అంగీకారయోగ్యం కాదని సుప్రీం స్పష్టం చేసింది.

# ఈ వారంలోనే పంచాయతీ షెడ్యూల్..!

- మూడు దశల్లో పోలింగ్ ప్రక్రియ
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికల నిర్వహణకు చర్యలు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఎస్ఈసీ ఆదేశం
- సీఎస్, డీజీపీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈ వారంలో ప్రకటించే అవకాశముంది. మూడు దశల్లో నిర్వహించే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశించింది. గురువారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎస్ రామకృష్ణరావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసి కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల ప్రచురణ, ఎన్నికల నిర్వహణకు రవాణా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, పరిశీలకుల మోహరింపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో మూడు విడతల్లో డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. మొత్తం పోలింగ్ ప్రక్రియను డిసెంబరు 16 వరకు పూర్తి చేయనున్నట్టు సమాచారం.

### ఎర్రకోట పేలుడు కేసులో

# మరో నలుగురు అరెస్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశ రాజధానిలోని ఎర్రకోట పేలుడు కేసులో మరో నలుగురు నిందితులను గురువారం ఎన్ఐఏ అరెస్టు చేసింది. వీరిని విచారించడానికి 15 రోజుల పాటు తమకు అప్పగించాల్సిందిగా ఎన్ఐఏ ఢిల్లీ కోర్టును కోరింది. కాగా పది రోజుల పాటు ఎన్ఐఏ కస్టడీకి పంపుతూ సెషన్స్ న్యాయమూర్తి అంజు బజాజ్ చంద్నా ఆదేశాలు జారీ చేశారు. తాజా అరెస్టులతో ఈ కేసులో అరెస్టు చేసిన వారి సంఖ్య ఆరుకి చేరింది. ఈ నలుగురిని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజామ్మిల్ షకీల్ గనాయ్, అనంతనాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, లక్నోకి చెందిన డాక్టర్ షాహీన్ సయీద్, షోపియాన్‌కు చెందిన ముఫ్తి ఇర్ఫాన్ అమ్మద్ వాగేలుగా ఎన్ఐఏ గుర్తించింది. వీరందరూ ఎర్రకోట ఉగ్ర దాడిలో కీలక పాత్ర పోషించారని పేర్కొంది.

## గుండెపోటు వచ్చినా ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ డ్రైవర్

**బస్సును రోడ్డు పక్కకు తీసి ఆపి స్టీరింగ్‌పైనే కుప్పకూలి మృతి**

**బలగం టీవి, హైదరాబాద్**



తన ప్రాణాలు పోతున్నా, బస్సులో ఉన్న ప్రయాణికుల ప్రాణాలు కాపాడే దిశగా ఆఖరి క్షణం వరకు ఆలోచించిన ఆర్టీసీ డ్రైవర్ సాయి కృష్ణ చూపిన సేవాభావం అందరినీ కదిలించింది. గుండెపోటు వచ్చినప్పటికీ బస్సును రోడ్డు పక్కకు సురక్షితంగా ఆపి, అనంతరం స్టీరింగ్‌పైనే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు.

ఒడిశా రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న 44 ఏళ్ల పీ. సాయి కృష్ణ గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం నుంచి మల్కన్‌గిరి వరకు సుమారు 30 మంది ప్రయాణికులతో బస్సు నడుపుతున్నాడు. కానీ కోరాపుట్%-%సునాబెడ రహదారిలోని దుమురిపుట్ సమీపానికి చేరుకున్నప్పుడు సాయి కృష్ణకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. పరిస్థితి క్లిష్టమైనా, ప్రయాణికుల ప్రాణాల గురించి ఆలోచించిన అతడు బస్సును సురక్షితంగా రోడ్డుకు పక్కన నిలిపాడు. వెంటనే స్టీరింగ్‌పై కుప్పకూలిపోయాడు. సహ డ్రైవర్ వెంటనే బస్సును నడిపి కోరాపుట్‌కు తీసుకెళ్లాడు. అక్కడి ఎస్ఎల్ఎన్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి సాయి కృష్ణను తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తర్వాత సహ డ్రైవర్ సహాయంతో బస్సులోని ప్రయాణికులను వారి గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చినట్లు ఒడిశా ఆర్టీసీ అధికారులు తెలిపారు. డ్రైవర్ సాయి కృష్ణ చూపిన సమయస్ఫూర్తి, వల్ల ఒక పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు.

# కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి..

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫార్ములా ఈ కేసులో మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)పై విచారణకు రాష్ట్ర గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. కొద్ది రోజుల క్రితం కేటీఆర్‌పై విచారణకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు లేఖ రాసిన ప్రభుత్వం. గవర్నర్ ఆమోదంతో, త్వరలోనే కేటీఆర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అభియోగాలు నమోదు చేయనుంది. ప్రాథమిక విచారణ పూర్తయిన తర్వాత, ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం.

ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్‌ను విచారించడానికి ఎట్టకేలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏసీబీకి అనుమతిచ్చారు. ఈ మేరకు గురువారం గవర్నర్ సంతకంతో ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ-కార్ రేసింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా కేటీఆర్, రెండో, మూడో నిందితులుగా హెచ్ఎండీఏ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, సీఈఓ బీఎల్ఎన్ రెడ్డితో పాటు ఫార్ములా-ఈ కంపెనీ నిర్వాహకుల పైన ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ముఖ్యంగా రూ.54.88 కోట్లను ఫార్ములా ఈ-కార్ రేసింగ్ నిర్వాహకులకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి కానీ, ఆర్బీఐ నుంచి కానీ ఎలాంటి అనుమతులను పొందకుండా చెల్లింపులు చేశారని వీరిపై ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఈ నిధులను హెచ్ఎండీఏ నుంచి మంజూరు చేశారనీ, ఇందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మునిసిపల్ వ్యవహారాల శాఖ మంత్రి అయిన కేటీఆర్ అనుమతిచ్చారని ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి, ఏసీబీ అధికారులకు ఇచ్చిన వివరణలో తెలియజేశారు. ఈ కేసు విచారణను చేపట్టిన ఏసీబీ అధికారులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో పాటు కేటీఆర్‌ను నాలుగుమార్లు విచారించారు. చివరికి కోర్టులో ఛార్జిషీటు వేసి వీరిని ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతినివ్వాల్సిందిగా రాష్ట్ర విజిలెన్స్ విభాగానికి నివేదికను పంపించారు. ఆ నివేదికను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిస్తూ మరోవైపు నిబంధనల ప్రకారం కేటీఆర్‌పై ఛార్జిషీటు వేసి ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతిని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దాదాపు రెండు నెలల క్రితం తనకు అందిన ప్రతిపాదనను గవర్నర్‌కు పంపిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు.. కేటీఆర్‌పై ఛార్జిషీటు వేసి ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిని కోరారు. ఆనాటి నుంచి గవర్నర్ అనుమతి కోసం అధికారులు చకోర పక్షుల్లా ఎదురు చూశారు. ఎట్టకేలకు గవర్నర్ అనుమతి లభించడంతో కేటీఆర్‌తో పాటు అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, ఫార్ములా ఈ-కార్ రేసు ప్రతినిధులపై న్యాయపరంగా చర్యలు తీసుకోవడానికి నడుం బిగించారు. అయితే అరవింద్ కుమార్ సివిల్ సర్వెంట్ కావటం, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నా కేంద్రంలోని డీఓపీటీ నుంచి కూడా అనుమతి రావాల్సి ఉన్నది. దీనిపై డీఓపీటీకి లేఖ రాసిన ఏసీబీ అధికారులు.. ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ విషయానికి సంబంధించి డీఓపీటీ నుంచి ఇంకా అనుమతి రావాల్సి ఉన్నది. దీనిపై ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారుసిన్హా తన సీనియర్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. మరోవైపు ఇప్పటికే ఈ-ఫార్ములా కార్ రేసింగ్ కేసులో మనీలాండరింగ్ జరిగిందంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులపై పీఎంఎల్ఏ కేసులను నమోదు చేయడమేగాక వారిని కూడా విచారించిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసులో తమ అనుమతి లేకుండా విదేశాలకు రూ.54.88 కోట్లకు పైగా నిధులను తరలించినందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్బీఐ రూ.7 కోట్ల జరిమానాను కూడా విధించిన విషయం విదితమే. తాజా పరిణామాల పట్ల బీఆర్ఎస్ వర్గాల్లో కేటీఆర్ పట్ల ఏసీబీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారు, అరెస్ట్ చేస్తారా, చేస్తే ఎప్పుడు చేస్తారనే ఉత్కంఠ నెలకొన్నది.

### ప్రజాపంపిణీ బకాయి

# నిధులు విడుదల చేస్తాం




- కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి
- నల్లగొండ జిల్లాలో భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయం ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"తెలంగాణకు రావాల్సిన కోవిడ్ సమయానికి సంబం ధించి ప్రజాపంపిణీ వ్యవస్థ బకాయి నిధులు రూ.343 కోట్లు వెంటనే విడుదల చేస్తాం.. అలాగే సీఎంఆర్ డెలివరీకి సంబంధించి 10 ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ. 1400 కోట్లకు సరైన రికార్డులు సమర్పిస్తే పరిశీలించి మంజూరు చేస్తాం.." అని కేంద్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్‌జోషి చెప్పారు. ఆహార భద్రతలో భాగంగా దేశంలోని 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రతి నెలా 5 కిలోల ఉచిత బియ్యాన్ని ఇస్తున్నామని, దాన్ని 2030 వరకు కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించినట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కోవిడ్ మహా విపత్తులో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదన్న ఉద్దేశంతో ఆహార భద్రత కింద పేదలందరికీ 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం ఇవ్వడం ప్రారంభించినట్టు చెప్పారు.

దేశవ్యాప్తంగా వ్యాప్తంగా 2 కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. ప్రతినెల తెలంగాణకు 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు కేటాయిస్తున్నామని, లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, 3370 మెట్రిక్ టన్నుల గోధుమలు ఇస్తున్నట్టు చెప్పారు. ఆహార భద్రత వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్ కార్డులన్నిటినీ డిజిటలైట్ చేసినట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, ప్రస్తుతం ప్రారంభించిన ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాంలో 62 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అన్నారు. ప్రభుత్వం భూమి ఇస్తే మరో ఎఫ్‌సీఐ గోదామును జిల్లాలో నిర్మించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 2014 -15 నుంచి తెలంగాణలో ధాన్యం సేకరణను 600శాతం పెంచినట్టు చెప్పారు. రైతులు వరి ధాన్యం వైపే కాకుండా ఆయిల్ సీడ్స్, వాణిజ్య పంటలు పండించాలని కోరారు.

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా బత్తాయి పంటకు ప్రసిద్ధి చెందిందని, జిల్లాకు 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బత్తాయి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ధాన్యానికి సంబంధించి ప్రయివేటు ప్రభుత్వ భాగస్వామ్యంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదామును మంజూరు చేయాలని అన్నారు. ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, భారత ఆహార సంస్థ ఈడి వనిత శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, భారత ఆహార సంస్థ జిల్లా మేనేజర్ రాజు, ఎఫ్‌సీఐ అధికారులు పాల్గొన్నారు.

# కడియం, దానంకు నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్**



ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లపై వివరణ కోరుతూ శాసనసభ్యులు కడియంశ్రీహరి, దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు ఇచ్చారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందుకుగాను ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై విచారణ కొనసాగుతున్నది. దానం నాగేందర్, కడియంశ్రీహరి మాత్రం మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరారు. గురువారం ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు చెందిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుండటంతో మిగతా ఇద్దరికీ స్పీకర్ ఇంకోసారి నోటీసులు ఇచ్చారు. తన నోటీసులకు స్పందించి వెంటనే అఫిడవిట్ సమర్పించాలని స్పీకర్ ఆదేశించారు. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయసలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత స్పీకర్ తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉన్నట్టు అసెంబ్లీ అధికారవర్గాలు చెబుతున్నాయి. నాలుగు వారాల్లో ఈకేసుల్లో నిర్ణయం ప్రకటించాల్సి ఉన్న నేపథ్యంలో స్పీకర్ విచారణను వేగవంతం చేయడం గమనార్హం. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీ తరపున వారి న్యాయవాదులు స్పీకర్ ఎదుట హాజరై గురువారం వాదనలు వినిపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విచారణ కొనసాగింది. తమ క్లయింట్లు నియోజవర్గాల అభివృద్ధి కోసమే సీఎంను కలిశారు తప్ప, పార్టీ మారడం కోసం కాదన్నారు.

## న్యాయపరంగా ఎదుర్కొంటాం

- కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్య
- కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది : ఎమ్మెల్యే హరీశ్‌రావు

వివరాలు 2వ పేజీలో

## దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం



- అందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం
- సీఎం రేవంత్ రెడ్డి
- అనలాగ్ ఏఐ సీఈఓ అలెక్స్ కిప్‌మన్‌తో సీఎం భేటీ

వివరాలు 2వ పేజీలో

# దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీని పరిశీలించాలి..



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ నగరానికి వచ్చిన కేంద్ర మంత్రితో సీఎం సమావేశం

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా వినియోగదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి తో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఈరోజు ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలకు సన్నబియ్యం పంపిణీ అంశంపై వివరించారు. ప్రజలు తినే బియ్యం సరఫరా చేసినప్పుడే ఆ సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్నట్టుగా దేశ వ్యాప్తంగా వినియోగదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయంలో అవసరమైతే సమగ్రంగా అధ్యయనం చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. పూర్తి స్థాయి అధ్యయనం జరిపిన తరువాత దేశ వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హాస్టల్‌లో డీఎంహెచ్ఓ రజిత ఆకస్మిక తనిఖీ..

- విద్యార్థినులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన..



**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత గురువారం తంగళ్ళపల్లి మండలంలోని తెలంగాణ మైనార్టీ బాలికల హాస్టల్ మరియు బాలికల ట్రైబల్ హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ విద్యార్థినుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత బాలికలకు రుతుస్రావం (మెన్స్ట్రువల్) పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతపై సమగ్ర అవగాహన కల్పించారు. తినే ముందు, బాత్రూమ్ నుండి బయటికి వచ్చిన తర్వాత చేతులను తప్పనిసరిగా సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్నందున, విద్యార్థినులు ఉన్ని దుస్తులు (స్వెటర్లు/షాల్స్) ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

**వంటశాల మరియు ఆహార నాణ్యత తనిఖీ..**

ఆహార పదార్థాల నిల్వలను, తయారు చేసే ఆహార పరిస్థితిని, ఆహార పదార్థాలు తయారు చేసే వ్యక్తులను పరిశీలించి, వ్యక్తిగత పరిశుభ్రత( కాళ్ళ చేతులు శుభ్రంగా, చేతి వేల గోర్లు చిన్నగా కత్రించుకోవాలని, తలలో వెంట్రుకలు రాలకుండా కాప్ (టోపీ) ధరించాలని, చేతులకు గ్లౌజులు కాళ్లకు సాకుస్ ధరించాలని ) మరియు పరిశుభ్రమైన ఆహారముపై అవగాహన కల్పించారు. శుభ్రమైన మరియు నాణ్యమైన ఆహారాన్ని అందించడం యొక్క ఆవశ్యకతపై కూడా ఆమె వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత తో పాటు డాక్టర్ సంపత్ కుమార్, సిహెచ్ఓ బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాల పెంపు లక్ష్యం..

- కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలు సాధించాలి
- జిల్లా వైద్యాధికారి డా. రజిత
- సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యాధికారి దిశా నిర్దేశం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అధ్యక్షతన జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్యంగా కేంద్ర ఆరోగ్య పథకాల అమలు, లక్ష్యాల సాధనపై చర్చ జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలను నిర్దేశిత సమయానికి కచ్చితంగా పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచడానికి గర్భిణీ స్త్రీలను ప్రోత్సహించాలని ఆమె వైద్యాధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తక్షణమే అమలు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పిఓఎంహెచ్‌యు (%ూఉ-వీజఎ%) డాక్టర్ అంజలి ఫ్రెండ్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, డాక్టర్ నహిమ లు సహ పలువురు ముఖ్య వైద్యాధికారులు పాల్గొన్నారు.



# విద్యావేత్త చుక్కా రామయ్యకు 100వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ విద్యావేత్త, సామాజిక ఉద్యమకారుడు, 'ఐఐటీ రామయ్య'గా సుపరిచితుడైన చుక్కా రామయ్యకు 100వ జన్మదిన శుభాకాంక్షలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చుక్కా రామయ్య నివాసానికి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చుక్కా రామయ్య 100వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న చుక్కా రామయ్య నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ తదితరులు ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది విద్యార్థులు ఐఐటీ పూర్తి చేసి, ప్రపంచ దేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడడానికి చుక్కా రామయ్యే కారణమని కొనియాడారు. ఆయన కేవలం విద్యా ప్రదాతగానే కాకుండా, తెలంగాణ పోరాటంలో, రాజకీయాల్లో కూడా దిక్సూచిగా తన పాత్ర పోషించారని అన్నారు. అలాంటి మహనీయుడు చుక్కా రామయ్య 100వ పుట్టినరోజు జరుపుకోవడం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని కేటీఆర్ పేర్కొన్నారు. నవంబర్ 20, 1925న జన్మించిన చుక్కా రామయ్య, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఐఐటీ ప్రవేశ పరీక్ష శిక్షణను అందుబాటులోకి తీసుకురావడంలో చేసిన కృషికి విశేష గుర్తింపు పొందారు.

# దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దడానికి తెలంగాణ ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు. ముఖ్యమంత్రి గారిని అనలాగ్ ఏఐ సీఈఓ శ్రీ అలెక్స్ కిప్‌మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించారు.

ట్రాఫిక్, అర్బన్ ఫ్లడింగ్, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కార మార్గాలపై సమావేశంలో చర్చ జరిగింది, 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్‌టైమ్ సెన్సార్ నెట్వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేయవచ్చని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీలో ఫిజికల్ ఇంటెలిజెన్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రోగ్రాం ఎనిమిది వారాల పాటు అమలుకానుంది. ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులో భాగంగా సీసీటీవీ వ్యవస్థను రియల్‌టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మార్చడం జరుగుతుంది. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలను ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేస్తారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి లైవ్‌గా మానిటరింగ్ నిర్వహిస్తారు. పైలట్ ప్రోగ్రాం పూర్తయ్యే సమయానికి హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా మారుతుందనే అంచనాలున్నాయి.

భారత్ ఫ్యూచర్ సిటీని పరిశోధన, సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను ముఖ్యమంత్రి గారు వివరించారు. ఆర్థిక వృద్ధికి ఫిజికల్ ఇంటెలిజెన్స్ అత్యుత్తమ పరిష్కారాలను అందిస్తుందని అలెక్స్ కిప్‌మన్ గారు పేర్కొన్నారు. డిసెంబర్ 8%-%9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ముఖ్యమంత్రి గారు అలెక్స్ కిప్‌మన్ గారిని ఆహ్వానించారు.




# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని ఎన్డీయే వర్గాలు తెలిపాయి.

బీహార్ రాజకీయాల్లో అత్యంత కాలం ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన నితీశ్ కుమార్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. 2000 సంవత్సరంలో కేవలం ఏడు రోజులు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన, తర్వాత క్రమంగా రాజకీయ బలం పెంచుకొని, వివిధ కూటములతో కలిసి అనేక దఫాలు అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు పదోసారి సీఎంగా ప్రమాణం చేసి రికార్డు సష్టించారు.

# న్యాయపరంగా ఎదుర్కొంటాం

- కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్య
- కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది..
- హరీష్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు (కేటీఆర్)పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యే అని ఆయన ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో చిల్లర డ్రామాకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని హరీష్ రావు అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి రేవంత్ రెడ్డి ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫార్ములా ఈ రేస్ పూర్తి పారదర్శకతతో జరిగిందని, దీనిపై కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లుగా కేసు పెట్టి కోడిగుడ్డుపై ఈకలు పీకుతుందని ధ్వజమెత్తారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పెట్టుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని హరీష్ రావు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటామని ఆయన తెలిపారు.

# యాషెస్ సిరీస్‌కు రంగం సిద్ధం



● పెర్త్‌లో శుక్రవారం తొలి టెస్ట్

బలగం టీవీ, పెర్త్

ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌కు వేదిక సిద్ధమైంది. శుక్రవారం ఉదయం పెర్త్ వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఐదు మ్యాచ్‌ల ఈ మహాసిరీస్‌కు నాంది పలకనుంది. భారత్%-పాకిస్థాన్ పోరుతో సమానంగా క్రికెట్‌లో అత్యంత హోరాహోరీగా సాగేది యాషెస్ సిరీస్‌గానే పరిగణించబడుతోంది.

ఈసారి ఆస్ట్రేలియా ఆతిథ్య దేశంగా సిరీస్‌కు సిద్ధమవుతోంది. గత సారి లానే ఈసారి కూడా సిరీస్‌ను కాపాడుకోవాలనే దృఢ నిశ్చయంతో ఆతిథ్య జట్టు బరిలోకి దిగుతోంది. మరోవైపు ఎన్నో ఏళ్లుగా యాషెస్‌ను స్వాధీనం చేసుకోవాలనే లక్ష్యంతో ఇంగ్లండ్ ఈసారి కూడా పట్టుదలగా సన్నాహాలు పూర్తి చేసుకుంది. దాంతో ఇరు జట్ల మధ్య పోరు కఠినంగా ఉండనుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**తొలి టెస్ట్‌కు ఇంగ్లండ్ ముందుగానే జట్టు ప్రకటింపు**

తొలి టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు రెండు రోజుల ముందుగానే తుది జాబితాను ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. బజ్‌బాల్ శైలిలో ఏమాత్రం తగ్గబోమని ఇంగ్లండ్ మరోసారి సందేశం ఇచ్చింది. బుధవారం ప్రకటించిన 12 మందితో కూడిన జట్టులో కెప్టెన్ బెన్ స్టోక్స్‌తో పాటు జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్, మార్క్ వుడ్ నిలిచారు.

సాధారణంగా టాస్‌కు ముందే తుది జట్టును వెల్లడించే సంప్రదాయం లేకపోయినా, ఈసారి మ్యాచ్‌కు రెండు రోజుల ముందే జట్టును ప్రకటిస్తూ ఇంగ్లండ్ కొత్త విధానానికి తెర తీశింది. పిచ్ కండిషన్స్, ప్రత్యర్థి విశ్లేషణతో సంబంధం లేకుండా ముందుగానే జట్టును ఖరారు చేయడంపై క్రికెట్ అభిమానులు విస్తృతంగా స్పందిస్తున్నారు.

**బజ్‌బాల్ కొనసాగింపు**

ఇంగ్లండ్ కోచ్‌గా బ్రెండన్ మెక్‌కల్లమ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో ఎదురు దాడి శైలికి ఊపందింది. రిస్క్ ఉన్నా దూకుడే లక్ష్యంగా బజ్‌బాల్ గేమ్‌ను కొనసాగిస్తున్న ఇంగ్లండ్, ఈ యాషెస్‌లో కూడా అదే ధాటిని ప్రదర్శించేందుకు సిద్ధమవుతోంది. విజయాలు%-%పరాజయాలతో సంబంధం లేకుండా దాడి మోడ్‌ను మార్చని ఈ అప్రోచ్ మరోసారి చర్చనీయాంశమైంది.



# రోహిత్‌కు షాక్.. ఒక్క పాయింట్‌తో అగ్రస్థానం కోల్పోయిన హిట్‌మ్యాన్

● టాప్ ర్యాంకుకు చేరుకున్న డారిల్ మిచెల్

బలగం టీవీ, హైదరాబాద్

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అగ్రస్థానం కోల్పోయాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 782 పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు చేరుకోగా, 781 పాయింట్లతో రోహిత్ రెండో స్థానానికి దిగివచ్చాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో మిచెల్ కనబరచిన మెరుగైన ప్రదర్శన అతడిని రెండు స్థానాలు పైకెత్తింది. అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానాన్ని దక్కించుకోగా, భారత ఆటగాళ్లైన శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ వరుసగా నాలుగు, ఐదు ర్యాంకుల్లో నిలిచారు. టీమిండియా మధ్యవర్తి బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఎనిమిదో ర్యాంక్‌ను అందుకున్నాడు.

ఇక వన్డేల్లో టాప్ ర్యాంక్‌ను సాధించిన అరుదైన కివీస్‌గా మిచెల్ చరిత్ర సృష్టిం చాడు. 1979లో గ్లెన్ టర్నర్ తర్వాత ఈ ఘనతను సాధించిన రెండో న్యూజిలాండ్ బ్యాటర్‌గా నిలిచాడు. బౌలింగ్ విభాగంలో అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్నాడు. ఇంగ్లండ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ రెండో, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ మూడో స్థానాల్లో ఉన్నారు. శ్రీలంకకు చెందిన తీక్షణ నాలుగో, నమీబియా బౌలర్ బెర్నార్డ్ ఐదో స్థానంలో నిలిచారు. భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆరో ర్యాంక్‌ను కొనసాగించాడు. టెస్ట్ విభాగంలో ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ బ్యాటింగ్‌లో, టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు.

# ఆరోగ్య కారణాల వల్ల అండాలను ఫ్రీజ్ చేశా..

**ఇప్పుడు కవలలకు జన్మనివ్వబోతున్నా.. అపోలో కంపెనీ వైస్‌చైర్‌పర్సన్ ఉపాసన కొణిదల**

బలగం టీవీ, హైదరాబాద్



టాలీవుడ్ నటుడు రామ్ చరణ్ భార్య, అపోలో కంపెనీ వైస్‌చైర్‌పర్సన్ ఉపాసన కామినేని కొణిదల చేసిన ఎగ్ ఫ్రీజింగ్ వ్యాఖ్యలు మరోసారి హల్చల్ సృష్టిస్తున్నాయి. ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమంలో యువతులకు ఎగ్ ఫ్రీజింగ్‌ను ప్రోత్సహిస్తూ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. వైద్యులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, నెటిజన్లు ఆమె అభిప్రాయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఉపాసన తాజాగా ఎక్స్‌లో ఓ పోస్టుతో స్పందించారు.

ఉపాసన తన వ్యాఖ్యలు ప్రజల్లో పెద్ద చర్చకు దారితీసినందుకు సంతోషం వ్యక్తం చేసింది. ఎగ్ ఫ్రీజింగ్‌కు సంబంధించి లాభ - నష్టాలను తెరవెళ్లిగా చర్చించడం సమాజానికి ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంలో తన వ్యక్తిగత ప్రయాణాన్ని కూడా వివరించారు. 27 ఏళ్ల వయసులో తన ఇష్టప్రకారమే వివాహం చేసుకున్నానని, 29 ఏళ్లకు వ్యక్తిగత-ఆరోగ్య కారణాల వల్ల అండాలను ఫ్రీజ్ చేసుకున్నానని, 36 ఏళ్లకు తొలి సంతానం కలిగిందని, 39 ఏళ్ల వయసులో కవలలకు జన్మనివ్వబోతున్నానని వెల్లడించారు.

పెళ్లి-కెరీర్ మధ్య పోటీ సహజమేనని, అయితే తాను ఈ రెండింటికి ప్రత్యేక సమయం కేటాయించి జీవన నిర్ణయాలు తీసుకున్నానని చెప్పారు. ఫాలోవర్ల నుంచి వస్తున్న మర్యాదపూర్వక స్పందనకు ధన్యవాదాలు తెలిపిన ఆమె, ఉద్యోగ సంస్థలు మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు.

ఐఐటీ హైదరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ "మహిళలకు అతిపెద్ద బీమా వారి అండాలను ఫ్రీజ్ చేసుకోవడమే. ఆర్థికంగా బలపడిన తర్వాత పెళ్లి, సంతానం విషయాల్లో నిర్ణయం తీసుకోవడం సులభమవుతుంది" అని అభిప్రాయపడ్డారు. చర్చలో పెళ్లి చేసుకోవాలనుకునే వారు ఎవరన్న ప్రశ్నకు అబ్బాయిలే ఎక్కువగా చేతులు పైకెత్తడం 'ప్రగతిశీల భారతానికి నిదర్శనం' అని వ్యాఖ్యానించారు. ఉపాసన సూచనలపై వైద్యులు పలు ఆందోళనలు వ్యక్తం చేశారు. ఫెర్టిలిటీ చికిత్సలు అంత సులభం కావని, ఐవీఎఫ్, ఎగ్ ఫ్రీజింగ్ భారీ వ్యయం కలిగిస్తాయని పలువురు నిపుణులు స్పష్టం చేశారు.




# G.O.A.T నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటిస్తున్న క్రికెట్ నేపథ్య కామెడీ చిత్రం 'G.O.A.T(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్)' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ ఈ పాటను ఆవిష్కరించారు. లియోన్ జేమ్స్ స్వరపరిచిన ఈ లవ్ మెలోడీకి అనురాగ్ కులకర్ణి గానమందించగా, సురేష్ బనిసెట్టి రాసిన సాహిత్యం హీరో భావోద్వేగాలను అందంగా ప్రతిబింబించింది. సుధీర్%-%దివ్యభారతి కెమిస్ట్రీ ఈ మెలోడీలో ప్రధానాకర్షణగా నిలిచింది. ప్లెజెంట్ విజువల్స్, సాఫ్ట్ లవ్ ట్రాక్ ప్రేక్షకుల్లో మంచి కనెక్షన్‌ను ఏర్పరచడంతో ఆల్బమ్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. మొగుళ్ళ చంద్రశేఖర్ నిర్మాణంలో, జైశ్నవ్ ప్రొడక్షన్, మాహాతేజ క్రియేషన్స్ బ్యానర్లపై తెరకెక్కుతున్న ఈ చిత్రం షఉటింగ్ పూర్తిచేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. త్వరలోనే సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు.

## రాజమౌళి వ్యాఖ్యలపై రాజాసింగ్ ఆగ్రహం

బలగం టీవీ, హైదరాబాద్

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు పెద్ద వివాదానికి దారితీశాయి. ఓ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రస్థాయిలో స్పందించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన రాజమౌళిపై చర్యలు తీసుకుని జైలులో పెట్టాలని డిమాండ్ చేస్తూ ఒక వీడియోను ఆయన విడుదల చేశారు. రాజమౌళి దేవుళ్లపై నమ్మకం లేదని చెబుతుండడంతో, "అయితే దేవుళ్ల పేరుతో సినిమాలు తీసి కోట్లలో సంపాదించడం ఎలా?" అని రాజాసింగ్ ప్రశ్నించారు. ప్రభాస్‌తో తెరకెక్కిన బాహుబలి చిత్రంలో శివలింగం ఎత్తించే సన్నివేశాన్ని చూపించి లాభాలు పొందిన రాజమౌళి ఇప్పుడు హిందూ దేవుళ్లపై నమ్మకం లేదని చెప్పడం సరికాదన్నారు. హిందూ ధర్మంపై అభిమానం లేని దర్శకుడి సినిమాలను హిందువులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తాజాగా రూపొందుతున్న 'వారణాసి' సినిమా ప్రచార కోసమే రాజమౌళి ఇలా మాట్లాడారా, లేక నిజంగానే నాస్తికుడా? అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. గతంలో కూడా రాముడు, కృష్ణుడిపై రాజమౌళి ఇలాంటి వ్యాఖ్యలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.ఇలాంటి దర్శకుడిపై హిందువులు ఫిర్యాదులు చేయాలని ఆయన కోరారు. రాజమౌళి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో భారీ చర్చకు దారితీశాయి.

## ఏఐ మార్ఫింగ్‌పై కీర్తి సురేశ ఆవేదన

బలగం టీవీ, హైదరాబాద్



ప్రముఖ నటి కీర్తి సురేశ్ తన పేరుతో ఆన్‌లైన్‌లో వ్యాపిస్తున్న ఏఐ మార్ఫింగ్ ఫోటోలుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ నకిలీ చిత్రాలు తనను మానసికంగా తీవ్రంగా కలవరపెడుతున్నాయని ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ ఫేక్ ఫోటోలు అంత సహజంగా ఉన్నాయంటూ కీర్తి పేర్కొన్నారు. "చిత్రాలను చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని నన్ను నేనే అనుమానించే స్థితి వచ్చింది. ఇది ఏఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో చెప్పే ఉదాహరణ" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ డీప్‌ఫేక్ సామర్థ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో నియంత్రణ కష్టతరం అవుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా వ్యక్తుల చిత్రాలను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కీర్తి స్పష్టం చేశారు. ఈ సమస్య కేవలం సినీ ప్రముఖులకు మాత్రమే కాదు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఉపయోగించే ప్రతి ఒక్కరికీ ముప్పని హెచ్చరించారు. కీర్తి వ్యాఖ్యలకు నటి ఆండ్రియా జెరెమియా మద్దతు తెలిపారు. గతంలో రష్మిక మందన్న, సమంత తదితర నటీమణులు కూడా డీప్‌ఫేక్ దుష్ప్రభావాలను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా జరిగిన ఈ ఘటన ఏఐ దుర్వినియోగంపై మరింత కఠిన చట్టాల అవసరాన్ని మరోసారి స్పష్టంచేస్తోంది.



# 'రాజు వెడ్స్ రాంబాయి' టికెట్ ధర బంపర్ ఆఫర్

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ నుంచి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తాజా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి' శుక్రవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ ప్రేక్షకులకు బిగ్ ఆఫర్‌ను ప్రకటించింది. సినిమా టికెట్ ధరను తగ్గిస్తూ ప్రత్యేక ఆఫర్‌ను అమలు చేయనున్నట్లు నిర్మాణ బృందం వెల్లడించింది. సింగిల్ స్క్రీన్లలో ఈ చిత్రాన్ని కేవలం రూ.99కే అందించగా, మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరను రూ.105గా నిర్ణయించారు. రూరల్ తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అఖిల్, తేజస్విని జంటగా నటించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వేణు వుడుగుల నిర్మించగా, బన్నీ వాసు, వంశీ నందిపాటి సమర్పిస్తున్నారు. తక్కువ టికెట్ ధరతో విడుదల కానుండటం వల్ల ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.